క్లుప్తంగా

మోటార్ సైకిళ్ల దొంగల అరెస్టు

బల్లికురవ: మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. మండలంలోని కొత్తూరు పంచాయతీలోని అరుణగిరి తండా, వినుకొండలో ఇటీవల చోరీ అయిన రెండు మోటారు సైకిళ్ల స్వాధీనంతో నిందితులను మంగళవారం అదుపులోకి తీసుకున్నామని ఎస్సై జీవీ చౌదరి తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. కొత్తూరు గ్రామానికి చెందిన తన్నీరు నరసింహారావు, పల్నాడు జిల్లా బొల్లాపల్లి గ్రామానికి చెందిన గోగు నరసింహారావులు కొప్పరపాడు సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని విచారించగా మోటారు సైకిళ్ల చోరీ చేసినట్లు అంగీకరించగా అద్దంకి కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు. గతంలో నరసరావుపేట, శావల్యాపురం, అద్దంకి, పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో దొంగతనాలపై వీరిరువురిపై పలు కేసులు నమోదైనట్లు ఎస్సై వివరించారు.

అపార్ ఐడీతో విద్యార్థికి ఉపయోగం



మాట్లాడుతున్న చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

అద్దంకి రూరల్: 9,10 తరగతుల విద్యార్థులకు అపార్ ఐడీ తప్పనిసరిగా నమోదు చేయాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి అబ్బరాజు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం అద్దంకి మండలంలోని ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లతో మంగళవారం రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యుడైస్‌లో విద్యార్థుల ఫోన్ నంబర్లు, తల్లిదండ్రుల ఆధార్, వివరాలు సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తొలుత గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు గంగాధరరావు, సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కారంచేడు: పేకాడుతున్న ఐదుగురిని కారంచేడు ఎస్ఐ వీ వెంకట్రావు అరెస్ట్ చేశారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని జరుబులవారిపాలెం గ్రామంలో పేకాడుతున్న వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో దాడి చేసి వారి వద్ద నుంచి రూ.550 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడా పేకాటలు, కోడిపందేలు నిర్వహించకూడదన్నారు.

చికిత్స పొందుతూ మాజీ ఎంపీటీసీ మృతి



బలరామిరెడ్డి (ఫైల్)

జే.పంగులూరు: వారం రోజుల క్రితం ఇంకొల్లు సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బూదవాడ గ్రామ మాజీ ఎంపీటీసీ ఈమ బలరామిరెడ్డి (77) చికిత్స పొదుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు ఎంపీటీసీగా 2009 నుంచి 2014 వరకు వైస్ ఎంపీపీగా పనిచేశారు. అనంతరం కొంత కాలం బూదవాడ గ్రామంలో 2020లో సొసైటీ చైర్మన్‌గా పనిచేశారు. మంగళవారం ఆయన స్వగ్రామం బూదవాడలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

200 మందికి పింఛన్లు, బియ్యం పంపిణీ



వృద్ధులకు పెన్షన్లు, బియ్యం అందిస్తున్న ఆవోపా సభ్యులు

చీరాల అర్బన్: ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (ఆవోపా) ఆధ్వర్యంలో మంగళవారం వికలాంగులు, వృద్ధులకు పెన్షన్లు, బియ్యం పంపిణీ చేశారు. స్థానిక ఆవోపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వికలాంగులు, వృద్ధులు మొత్తం 200 మందికి పెన్షన్లు, బియ్యం పంపిణీ చేసి భోజనం అందించారు. ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ఎంతో మందికి ఉపయోగపడ్డాయని ముఖ్య అతిథిగా హాజరైన మద్దు వెంకట సుబ్బారావు, గెల్లి సుకన్యలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ రాఘవేంద్రరావు, అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, కార్యదర్శి ఏకాంబరేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ ఆలయ ప్రతిష్ఠ

యద్దనపూడి: మండల కేంద్రం యద్దనపూడి గ్రామంలో బుధవారం పోలేరమ్మ, పోతురాజు స్వామివార్ల ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామ ప్రజలు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొలతల్లో తేడా..
తూకాల్లో మోసం

- మోసపోతున్న వినియోగదారులు
- పట్టించుకోని తూనికలు, కొలతల అధికారులు

మేదరమెట్ల:

ఒక వైపు నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలు, వండ్లు, బియ్యం ధరలు చుక్కలు అంటుతుండటంతో సామాన్య జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు కొని తినాలంటే సామాన్యుడికి తలకుమించిన భారంగా మారింది. దీనికి తోడు వినియోగదారుడికి విక్రయించే ప్రతి వస్తువులోనూ వ్యాపారులు సక్రమంగా తూకాలు, కొలతలు వేయకపోవడంతో సామాన్యుడి జీవనం అగమ్యగోచరంగా మారింది. మేదరమెట్లలో వినియోగదారుడు కొనుగోలు చేసే నిత్యావసరాల్లో అటు కూరగాయల్లోనూ, మాంసం, చేపలు, పచారీ సరుకుల్లోనూ కిలోకు 100 గ్రాముల నుంచి 150 గ్రాముల వరకూ తూకంలో తేడాలొస్తున్నాయి. దీనిని పట్టించుకోవాల్సిన తూనికలు కొలతల శాఖాధికారులు ఉన్నారో లేరో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వ్యాపారులు తమ ఇష్టానుసారం తూకాలు వేసి వినియోగదారులను మోసం చేస్తున్నారు.

బియ్యం బస్తాల్లో మూడు కిలోలు తక్కువ..

బియ్యం వ్యాపారులు 25 కిలోల బస్తా అని విక్రయించే బస్తాలో రెండు నుంచి మూడు కిలోల బియ్యం తక్కువగా ఉంటున్నాయి. 25 కిలోలకు బదులు 22, 23 కిలోలు మాత్రమే ఉంటున్నాయి. వినియోగదారుడి దగ్గర మాత్రం 25 కిలోలకు డబ్బులు తీసుకుంటున్నారు.



విక్రయానికి సద్ధంగా ఉంచిన బియ్యం బస్తాలు

కూరగాయలు, కోడి మాంసం, మటన్, చేపల తూకంలోనూ తక్కువే..

వ్యాపారులు విక్రయించే మాంసం, కూరగాయలు, చేపల తూకంలో కిలో అని చెప్పి విక్రయించే దానిలో 850 నుంచి 900 గ్రాములు మాత్రమే ఉంటున్నాయి. అంటే కిలోకి 100 నుంచి 150 గ్రాములు తగ్గుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఇలా ఒక్కటేంటి వినియోగదారుడు కొనుగోలు చేసే ప్రతి సరుకుల్లోనూ తూకంలో తక్కువగానే వ్యాపారులు ఇవ్వడం జరుగుతోంది. కిలో కూరగాయలు కొనుగోలు చేస్తే వినియోగదారునికి వచ్చేది 850 గ్రాములు మాత్రమే. ద్రాక్ష వంటి పండ్లు విక్రయంలో కూడా కిలోకి వంద గ్రాములు తక్కువగానే విక్రయిస్తున్నా. నిత్యం కొనుగోలు చేస్తున్న నిత్యావసరాల ధరలు ఒక పక్క ఆకాశాన్ని తాకుతుంటే దీనికి తోడు వ్యాపారులు తూకంలో దగా చేయడంపై ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తూనికలు, కొలతల అధికారులు స్పందించి తూకాల్లో మోసం జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కిరాణా దుకాణంలో తూకం వేసే ఎలక్ట్రానిక్ కాటా

వదలని వాన.. రైతుల ఆందోళన



దర్శి రహదారి పక్కన పొలాల్లో నిలిచిన నీరు



వేటపాలెం సంతరావూరు ప్రధాన రోడ్డుపై నుంచి పారుతున్న వరద నీరు

- నీటమునిగిన పత్తి, చేతికొచ్చిన మినుము నీళ్లపాలు
- ఆవేదన చెందుతున్న రైతన్నలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

అద్దంకి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. కనీసం బయటకు వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి కలగడంతో ప్రజలు ఇక వద్దు బాబోయ్ వర్షం అని మొత్తుకుంటున్నారు. ఈ సంవత్సరం అతివృష్టి, అనావృష్టితో అల్లాడుతున్నామని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని గ్రామాల్లోని పంట పొలాల్లో మాగాణిసాగు చేసే పొలాల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. మరో వైపు వర్షపు నీరు నిలవడంతో పల్లపు పొలాల్లో సాగు చేసిన పశుగ్రాసం, కంది తదితర పంటలు ఉరకవేసే ప్రమాదం ఉందని, మరో వైపు పొగనారు దిబ్బలు పెట్టిన వారు కుళ్లిపోతునందని రైతులు వాపోతున్నారు.

రైతులకు పొంచిఉన్న వానగండం..

వేటపాలెం: రైతులకు వానగండం పొంచిఉంది. రెండు రోజులుగా ముసురు పట్టి వానలు కురుస్తున్నాయి. మరో మూడు రోజుల పాటు వర్షం కురుస్తాయని వాతావరణశాఖ చెప్తుండటంతో రైతుల గుండెలు అదురుతున్నాయి. ఇప్పటికే వాగులు, వంకలు నిండు కుండలా పారుతున్నాయి. ఇక మీద కురిసే వానలు మాత్రం వాటికి తోడయితే రైతులకు కష్టాలు తోడవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో వరి నారుమళ్లు మునిగిపోయాయి. వేటపాలెం నుంచి సంతరావూరు వెల్లే ప్రధాన రహదారిలో ముసలమ్మ కాలవకు వరద నీరు పోటెత్తడంతో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనితో ఈ మార్గం నుంచి వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

వరదలతో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు..

కారంచేడు/యద్దనపూడి: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో దిగువన ఉన్న కారంచేడు ప్రాంతంలో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని పోతినవారిపాలెం సమీపంలోని అలుగువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనికి తోడు గ్రామం సమీపంలోని నాగార్జునసాగర్ కాలువ కూడా ఎగువ నుంచి వస్తున్న వరదలతో పరుగులుపెడుతోంది. కాలువపై ఉన్న కల్వర్టు కూడా కుంగిపోయి వరద నీరు పొలాల మీదకు వస్తుందని రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే కుంగిన కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో తిమిడెదపాడు, దగ్గుబాడు, నాయుడువారిపాలెం, పోతినవారిపాలెం, కేశవరప్పాడు ప్రాంతాల్లో సాగు చేసిన మిరప, పొగాకు, మినుము రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మండలంలోని తిమిడెదపాడు-కేశవరప్పాడు గ్రామాల మధ్యన ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రెండు గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచి పోయాయి.

☛ యద్దనపూడి మండలంలోని పోలూరు, యద్దనపూడి, వింజనంపాడు వద్ద ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహించటంతో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి వర్షం వర్షం తెరిపించటంతో పాటు ఎండ రావటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



అద్దంకిలో వరి మాగాణి సాగు పొలాల్లో నుంచి పారుతున్న వర్షపు నీరు



యద్దనపూడి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



పోతినవారిపాలెం వద్ద ఎన్ఎస్పీ కాలువపై కుంగిన కల్వర్టు



దగ్గుబాడు సమీపంలో నిండుకుండలా ప్రవహిస్తున్న వాగు

రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన కలాం

- ఘనంగా మాజీ రాష్ట్రపతి కలాం జయంతి



చీరాలలో కేజీబీవీలో కలాం జయంతి నిర్వహిస్తున్న నేతాజీ సేవా సమితి ప్రతినిధులు



వలపర్లలో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చీరాల అర్బన్: దేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. కలాం జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. నేతాజీ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ విద్యారంగంలో అబ్దుల్ కలాం చేసిన సేవలను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 15న విద్యార్థుల దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. భారతదేశ క్షిపణి పితామహుడుగా పేరొందిన ఆయన దేశ 11వ రాష్ట్రపతిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం తవ్వా కృష్ణమోహన్, చుండూరి కృష్ణమూర్తి, పవని భానుచంద్రమూర్తి, దాసరి ఇమ్మానియేలు, సర్విశెట్టి సుబ్బరామయ్య, కొత్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ డి.ధనమ్మ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు బ్యాంకు ఆఫీసర్ పి.హరిప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

కలాం చిరస్మరణీయుడు..

మార్టూరు/కారంచేడు: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మార్టూరు మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. స్థానిక కొమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో ఉన్న కలాం విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కే వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ అధ్యక్షుడు మహేష్, సయ్యద్ కరిముల్లా పాల్గొన్నారు. మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్టూరు లోని విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఉద్యోగులు, పెన్షనర్లు కలాం చిత్రపటానికి నివాళులర్పించారు.

☛ కారంచేడు మండలం కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏ ఉమామహేశ్వరరావు కలాం చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఆయన జీవితాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి కోసమే 'పల్లెపండుగ'



బల్లికురవలో భూమిపూజలో పాల్గొన్న ఎంపీడీవో, ఎంపీపీ

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో ఉన్న సమస్యలను గుర్తించి సత్వరంగా పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకే ప్రభుత్వం పల్లె పండుగను నిర్వహిస్తోందని ఎంపీడీవో శివసుబ్రమణ్యం అన్నారు. మంగళవారం మండలంలోని దేవినూతల గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిచారు. గ్రామంలో ఉన్న సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటుగా ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాది పనులు, తదితర అంశాలపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో దాసు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి 'పల్లె పండుగ' నిధులు..

జే.పంగులూరు/బల్లికురవ: గ్రామాభివృద్ధికి పల్లె పండుగ నిధులు ఉపయోగపడుతాయని పంగులూరు ఎంపీడీవో స్వరూపరాణి పేర్కొన్నారు. మండలంలోని అలవలపాడు, రేణింగవరం, కశ్యాపురం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె పండుగ నుంచి వచ్చే నిధుల ద్వారా గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూ ఏఈ శివయ్య, పంచాయితీ రాజ్ ఏఈ హనుమంతురావు, హౌసింగ్ ఏఈ కిషోర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి లాం సునీత, ఏపీవో సంతోషమ్మ, టీడీపీ నాయకుడు ఓబులరెడ్డి పాల్గొన్నారు.

☛ బల్లికురవ మండలంలో బల్లికురవ, సక్కబొక్కలపాడు గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమతి, డీఆర్ఏఈ మాధవ్, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, సర్పంచ్‌లు పందిరి అంజిబాబు, రామయ్య పాల్గొన్నారు.

మార్టూరు: మండలంలోని బొబ్బేపల్లి, రాజు గారి పాలెం, లక్కవరం గ్రామాల్లో ఎంపీడీవో వై శ్రీనివాసరావు, ఈవోఆర్డీ రామాంజనేయులు ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.

వర్షాలకు పడిన గండ్లు పూడ్చాలి



సమస్యలపై మాట్లాడుతున్న ఎంపీపీ వాసుబాబు

కారంచేడు: మండలంలోని మొండి కాలువ, కప్పలవాగులపై పడిన గండ్లను ఇంత వరకు పూడ్చలేదని.. దీని వలన ప్రస్తుతం వస్తున్న వరదలో ఇప్పటికే వేసిన పంటలను నష్టపోవాల్సి వస్తుందని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావులు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఇరిగేషన్ అధీనంలో ఉన్న వాగులు, కాలువలకు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నివేదికలు కలెక్టర్ దృష్టిలో ఉంచామని అధికారులు తెలిపారు. అలాగే వ్యవసాయశాఖ ద్వార ప్రభుత్వం అందించే రాయితీ శనగలతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని వారు సభ దృష్టికి తెచ్చారు. బయట మార్కెట్ ధర కన్నా ఎక్కువగా విక్రయిస్తే రైతులకు ఎలా మేలు జరుగుతుందన్నారు. రేషన్ దుకాణాల ద్వార పేద ప్రజలకు అందించాల్సిన కందిపప్పు, పంచదారలను సక్రమంగా అందించడం లేదన్నారు. అన్నిశాఖల అధికారులు తమ శాఖల అభివృద్ధి, ప్రగతిని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు యార్లగడ్డ సుబ్బారావు, ఐనంపూడి వనజ, ఎంపీడీవో నేతాజీ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిత, ఎంఈఓలు, వైద్యులు, ఇరిగేషన్, డ్రైనేజ్, ఐసీడీఎస్, వ్యవసాయశాఖ అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో నేత్రదానం



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో జెట్టి వెంకటేశ్వర్లు(68) మంగళవారం చనిపోవడంతో ఆయన నేత్రాలను బంధువులు దానం చేశారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి) ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. వెంకటేశ్వర్లు భార్య ఝాన్సీ, కుమారులు సురేష్ జగదీష్, నగేష్‌లకు అవయవదాన కమిటీ సభ్యులు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ రఫి, కార్యదర్శి చుండి సాంబశివరావులు అభినందనలు తెలియజేశారు.

వర్షపు నీరు బయట వెళ్తేనే పంటకు ఆరోగ్యం

బల్లికురవ: తుఫాన్‌లతో మెట్ట పొలాల్లో నీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపాలని వ్యవసాయాధికారిణి ఎస్వీపీ కుమారి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం వల్లాపల్లి, అంబడిపూడి, గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. భూమిలో తేమ ఎక్కువగా ఉంటే ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలన్నారు. పొగాకు సాగు తగ్గించి పప్పుధాన్యాలు, మొక్కజొన్న సాగు చేపట్టాలని డీఏపీ, యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని కుమారి వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేతుల శుభ్రంతోనే మెరుగైన ఆరోగ్యం



చేతులు కడిగి అవగాహన కలిగిస్తున్న ఎంపీడీఓ

పర్చూరు (చినగంజాం): భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని తద్వారా అనారోగ్యాన్ని దూరం చేయవచ్చని పర్చూరు ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ అన్నారు. ప్రపంచ హ్యాండ్ వాష్ డే సందర్భంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన కమిషనర్

చీరాల: మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును ఆయన నివాసంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ రషీద్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణ అభివృద్ధికి పాటుపడాలని, చీరాల మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని చైర్మన్ సూచించారు.



మున్సిపల్ చైర్మన్‌కు మొక్క అందజేస్తున్న కమిషనర్ రషీద్

పాఠశాలలకు నిధులు విడుదల చేయాలి



ఎంఈఓతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందించే నిర్వహణ నిధులు విడుదల చేయాలని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.బాబూరావులు అన్నారు. మంగళవారం చీరాల పట్టణ పరిధిలోని పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసే నిధులు సకాలంలో మంజూరు కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే విద్యా విధానంపై దృష్టి సారించి నిర్వహణ నిధులు మంజూరు చేయాలన్నారు. అలానే నాడు-నేడు పనులు కూడా పూర్తి కాలేదన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావుతో వారు ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై మాట్లాడారు.